క్లుప్తంగా

హెల్మెట్‌ధారణపై అవగాహన



హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కళాధర్

వీరఘట్టం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణం చేయాలని ఎస్సై జి. కళాధర్ సూచించారు. సోమవారం స్థానిక పాలకొండ రోడ్డులో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. అలాగే వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.

సమస్యలపై స్పందించాలి..



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఎల్‌ఓలు

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో కీలక విధులు నిర్వహించిన బీఎల్‌ఓల సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ బాలమురళీ కృష్ణను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు మాట్లాడుతూ, ఇతర నియోజకవర్గాల్లో బీఎల్‌ఓలకు రూ.10 వేలు అందిస్తే పాలకొండలో మాత్రం 4 వేల రూపాయలు మాత్రమే అందించారని తెలిపారు. ఎన్నికల సమయంలో సాధారణ ఖర్చులు తామే భరించామని వాపోయారు. దీనికి తోడు టీఏ, డీఏ కూడా అందించలేదని తహసీల్దార్‌కు బీఎల్‌ఓలు సాయి, రాజా, తదితరులు తెలిపారు. దీనికి తహసీల్దార్ స్పందిస్తూ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఏపీఓ చిన్నబాబు

సీతంపేట: దోనుబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. సబ్జెక్టులకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం వసతిగృహంలో సరుకులు, రికార్డుల వివరాలు పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించే వంటకాలు నాణ్యతగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణరావు పాల్గొన్నారు.


విద్యాభివృద్ధికి కృషిచేయాలి



ఎస్‌ఎంసీ చైర్మన్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: పాఠశాల అభివృద్ధికి ఎస్‌ఎంసీ కమిటీలు కృషిచేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. నిడగల్లు ఉన్నత పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్, కమిటీ సభ్యులను సోమవారం ఆయన సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, పార్టీ నాయకులు బి.శ్రీరాములునాయుడు, అంబటి కృష్ణంనాయుడు, గాజాపు శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, సర్పంచ్ రాయిపిల్లి ఆరుద్రమ్మ, పి.బలరాంనాయుడు, బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

పార్వతీపురంటౌన్: జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా మంతిన వాసుదేవరావునాయుడు, కార్యదర్శిగా పత్తిక చంద్రమోహన్, కోశాధికారిగా గొడ్డు చక్రవర్తి, గౌరవ అధ్యక్షుడిగా మజ్జి రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జిల్లా ఎస్‌జీఎఫ్ డీడీ గాంధీ మురళీకృష్ణ, ఎం.జాకబ్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎంవీ రమణ, ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.



వీరఘట్టం: తెట్టంగిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మణరావు, తదితరులు



వీరఘట్టం: ప్రధాన కూడలి వద్ద జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేస్తున్న ఎంపీపీ దమలపాటి, వైఎస్సార్‌సీపీ నాయకులు



గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



జియ్యమ్మవలస: పెదమేరంగి కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ శశికళ, నాయకులు

రాజన్న చిరస్మరణీయుడు..

ప్రజల కోసం బతికిన వాడు.. ప్రగతి కోసం తపించిన వాడు మన రాజన్న.. తన హయాంలో ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ధన్యజీవి.. అటువంటి మహనీయుడు వర్ధంతి సోమవారం వాడవాడలా నిర్వహించారు. రాజన్న విగ్రహాలు, చిత్రపటాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల గుండెచప్పుడుగా చెరగని ముద్ర వేసుకున్న రాజశేఖరరెడ్డి చిరస్మరణీయుడని వక్తలు కొనియాడారు. ఆయన హయాంలో లబ్ధిపొందిన వారు చెమర్చిన కళ్లతో అంజలి ఘటించారు.

– పాలకొండ/కురుపాం నెట్‌వర్క్



సీతంపేట: స్థానిక బస్టాండ్ వద్ద వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి



పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలు వేసి అంజలి ఘటిస్తున్న నాయకులు, గ్రామస్తులు



పాలకొండ రూరల్: పాలకొండ- సీతంపేట రహదారిలో వెలగవాడ వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు



భామిని: కొరమ వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొమరాడ: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జనార్దననాయుడు, నాయకులు

ఆర్థిక సాయం కోల్పోతారు..

పాలకొండ రూరల్: సకాలంలో గృహ నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు ప్రభుత్వం అందించే రాయితీలు కోల్పోతారని హౌసింగ్ ఏఈ మాధవరావు స్పష్టం చేశారు. మండలంలోని తంపటాపల్లి, తుమరాడ, లుంబూరు, పట్టణ పరిధిలోని అర్బన్ కాలనీల్లో సోమవారం ఆయన పర్యటించి, నిర్మాణాల తాజా స్థితిగతులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. లబ్ధిదారులు వచ్చే ఏడాది మార్చి నాటికి నిర్మాణాలు పూర్తి చేయకుంటే ప్రభుత్వం అందిస్తున్న లబ్ధి పొందలేరన్నారు. ఇప్పటివరకు చేపట్టిన నిర్మాణాలకు బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. అనంతరం నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు నోటీసులు అందజేశారు. ఈయన వెంట ఇంజినీరింగ్ సహాయకులు వినయ్ కుమార్, శంకర్, తదితరులున్నారు.



తంపటాపల్లిలో లబ్ధిదారుకు నోటీస్ అందిస్తున్న అధికారులు

'ఏకలవ్య' విద్యార్థికి పాముకాటు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న అరిక వరుణ్‌ను పాముకాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. ఈ సమాచారం తెలుసుకున్న ప్రిన్సిపాల్ ఎస్.పెంటన్న హుటాహుటిన భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి బాధిత బాలుడిని తరలించారు. పరీక్షించిన వైద్యులు పాముకాటే అని నిర్ధారించలేదు. ప్రాథమిక వైద్య సేవలందించిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. భద్రగిరి ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరిన విద్యార్థిని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.



అస్వస్థతకు గురైన ఏకలవ్య పాఠశాల విద్యార్థి అరిక వరుణ్

కుక్కకాటుతో వ్యక్తికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పి.ఆమిటి గ్రామానికి చెందిన పువ్వల వీరస్వామిపై సోమవారం సాయంత్రం వీధికుక్క దాడిచేసి గాయపరిచింది. కుటుంబ సభ్యులు ఆయన్ను వెంటనే భద్రగిరి సీహెచ్‌సీకి తరలించి వైద్య అందించారు.

పరిహారం అందించి ఆదుకుంటాం..



జోబుగూడలో కూలిన ఇంటి గోడను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: వర్షాల కారణంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని జోబుగూడ, వంజరాపుగూడ గ్రామాల్లో వర్షాలకు కూలిపోయిన ఇంటి గోడలను సోమవారం పరిశీలించారు. బాధితులతో మాట్లాడి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట టీడీపీ నాయకులు పాడి సుదర్శనరావు, పోలూరి శ్రీనివాసరావు, తహసీల్దార్ అప్పారావు, ఆర్ఐ గిరి, వీఆర్వోలు గణపతి, గౌరమ్మ తదితరులున్నారు.

రెగ్యులర్ వైద్యులను నియమించాలి

పార్వతీపురంటౌన్: జిల్లాలోని ఆస్పత్రుల్లో రెగ్యులర్ వైద్యులను నియమించాలని, మందులను పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని సీపీఎం నాయకుడు రెడ్డి వేణు కోరారు. పట్టణంలోని యూపీహెచ్‌సీలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయని, ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యులు, మందులు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గత డిసెంబరు నెల నుంచి ఆస్పత్రుల్లో రెగ్యులర్ వైద్యులు లేరని, ఇన్‌చార్జి వైద్యులు వారంలో రెండు మూడుసార్లు వస్తుండటంతో మిగిలిన రోజుల్లో రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని, ఫీవర్ మరణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని, అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 4న పార్వతీపురం డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద, అలాగే 4,5,6 తేదీల్లో కురుపాం, సాలూరు, పాలకొండ సీహెచ్‌సీలు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు.

ఇద్దరు రోగులకు ఒకటే బెడ్!

బొబ్బిలి: పట్టణంలోని సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)కి రోగుల తాకిడి ఎక్కువైంది. వర్షాలు కురుస్తుండడంతో నీటి కలుషితం, అపరిశుభ్రత కారణంగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. అనారోగ్యం బారినపడిన ఎంతోమంది ఆస్పత్రి బాటపడుతున్నారు. అయితే ఆస్పత్రిలో సరిపడ బెడ్లు(మంచాలు) లేకపోవడంతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులు చొప్పున చికిత్స పొందాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఒక సమస్యతో ఆస్పత్రికి వస్తే మరో సమస్య వచ్చినట్లు ఉందని రోగులు, రోగి బంధువులు అనుకుంటున్నారు. ప్రతిరోజూ 400 వరకు ఓపీ వస్తోందని, ఆస్పత్రిలో ఉండాల్సి వచ్చిన వారికి సరిపడ మంచాలు లేకపోవడం వాస్తవం ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని సీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ జి.శశిభూషణరావు తెలిపారు.



ఒకే బెడ్ మీద చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులు

ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి

సీతంపేట: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జ్వరాలు విజృంభిస్తుండడంతో పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. సోమవారం స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి భారీగా రోగుల తాకిడి పెరిగింది. మలేరియా, టైఫాయిడ్‌తో బాధపడుతూ ఎక్కువ మంది రాగా.. సిబ్బంది వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారని ఆస్పత్రి సూపరింటిండెంట్ శ్రీనివాసరావు తెలిపారు.



రక్త పరీక్షల కేంద్రం వద్ద వేచి ఉన్న రోగులు

ఆశ వర్కర్ల వేతనాలు పెంచాలని వినతి

పార్వతీపురంటౌన్: ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని యూనియన్ నాయకులు వి.ఇందిర డిమాండ్ చేశారు. 2024 ఫిబ్రవరి 9న నాయకులతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల మేరకు జీఓలు విడుదల చేయాలని కోరుతూ డీఎంహెచ్‌ఓకు సోమవారం వర్కర్స్ యూనియన్ వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమశాఖ అధికారులు యూనియన్ రాష్ట్ర ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల్లో ఒప్పందాల జీఓలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ వర్క్, సెంటర్ వర్క్, అదనపు పనులు, పనిచేయని సెల్‌ఫోన్లతో ఆశా కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సెప్టెంబర్ 3న మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆశా వర్కర్లంతా మెడికల్ ఆఫీసర్స్‌కు వినతి పత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధానికి కమిటీలు వేయాలని, కంప్లెయింట్ బాక్స్‌లు ఏర్పాటు చేయాలని, మహిళా సిబ్బంది రక్షణ కోసం ప్రత్యేక చట్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ జిల్లా కార్యదర్శి ఎం.శివాని, కృష్ణవేణి, పద్మ, శాంతి, తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌ఓ పార్వతికి వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం

- ఎంపీడీఓ వెంకటరమణ

వీరఘట్టం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామ జన్‌మన్ పథకంలో భాగంగా గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని ఎంపీడీఓ వై.వెంకటరమణ తెలిపారు. కుంబిడి - ఇచ్చాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ, ఎటువంటి సౌకర్యాలు కల్పించాలో తన దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. రహదారులు, తాగునీటి వసతి, విద్యుత్ సదుపాయం, గృహ నిర్మాణాలు, తదితర అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బిడ్డిక గౌరినాయుడు, జేఈ డి.కల్యాణిదుర్గ, ఏపీఓ జి.సత్యంనాయుడు, ఈఓపీఆర్‌డీ ఎం.నాగభూషణరావు, పంచాయతీ ఈఓ వసంత్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంటకరమణ

సామూహిక సీమంతం

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా ఐసీడీఎస్ పీడీ ఎంఎస్ రాణి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. పండ్లు, పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో కొమరాడ ఐసీడీఎస్ పీఓ జి.సుగుణకుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 7వరకు పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పీఓ సుగుణకుమారి తెలిపారు.



సామూహిక సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పౌష్టికాహారం తప్పనిసరి

పాలకొండ రూరల్:

గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. పౌష్టికాహార దినోత్సవంలో భాగంగా సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ అధికారులు పలువురు గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.ఉమామహేశ్వరి, సీడీపీఓ సిమ్మాలమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దశారత్నం, టి.మేరీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



సామూహిక సీమంతం నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అప్రమత్తతే శ్రీరామరక్ష

- విజృంభిస్తున్న విషజ్వరాలు
- అవగాహన, అప్రమత్తతతో ఆరోగ్యం పదిలం

గరుగుబిల్లి: వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొంది. వీధుల్లో, ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెంది రోగాలను వ్యాప్తి చేస్తున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, తదితర వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించడంతో పాటు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారు. సీజనల్ వ్యాధులు, వాటి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

మలేరియా, డెంగీ..

జ్వరం తీవ్రంగా ఉన్నప్పుడు శరీరం వణుకుతుంది. పిల్లలో చలి జ్వరంవుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఇది మలేరియా జ్వరం లక్షణంగా భావించవచ్చు. డెంగీ, చికున్‌గున్యాతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. చిన్నారులలో తీవ్ర జ్వరం, తలనొప్పి, తుమ్ములు, వెన్నునొప్పి, శరీరం మీద పొక్కులు కనిపిస్తాయి. కాళ్లు, కీళ్లలో నొప్పి ఉంటుంది.

టైఫాయిడ్..

టైఫాయిడ్ రావడానికి ప్రధానకారణం కలుషిత నీరు, ఆహారం. ఇది త్వరగా ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే వ్యాధి. దీర్ఘకాలం జ్వరం, కడుపులో నొప్పి, తలనొప్పివస్తే టైఫాయిడ్‌గా పరిగణించాలి. శరీరం మీద దద్దుర్లు కూడా వస్తాయి. ఈ సమయంలో పిల్లలకు ఎక్కువగా ద్రవాలను తాగించాలి. వ్యాక్సినేషన్ చాలావరకు ఈ వ్యాధిని నివారిస్తుంది.

జలుబు, దగ్గు, వైరల్ జ్వరం వస్తే..

వాతావరణంలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు సాధారణంగా జలుబు వస్తుంది. జ్వరం, జలుబు, దగ్గు, ముక్కుకారడం, ఒంటి నొప్పులు దీని లక్షణం. ఎయిర్ కండీషన్ వల్ల కూడా జలుబు రావచ్చు. పిల్లల్లో ఆస్తమా రావడానికి జలుబు కూడా ఒక కారణంగా చెప్పొచ్చు. అలర్జీ రాకుండా డాక్టర్ సూచించిన మందులు వాడితే నయమవుతుంది.

అతిసార..

డయేరియా అనేది కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల వస్తుంది. తీవ్రమైన డయేరియా ఉంటే ద్రవపదార్థాలను మాత్రమే ఆహారంగా ఇవ్వాలి. రోగి ఎక్కువగా విశ్రాంతి తీసుకోవడం వల్ల తొందరగా నయమవుతోంది.

ఇంటి వైద్యం వద్దు



జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు గుర్తించిన వెంటనే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. జ్వరం తగ్గిపోతుందని నిర్లక్ష్యం చేయొద్దు. మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్ అయితే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ కె.కె.సాగర్‌వర్మ, గరుగుబిల్లి పీహెచ్‌సీ